

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి : ప్యానెల్ న్యాయవాదులు

ప్రజాశక్తి - తణుకు

ప్రమాదాలు జరిగినప్పుడు తలకు బలమైన గాయాలు అయ్యి, ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, హెల్మెట్ ధరించుట వల్ల కొంత వరకు ప్రాణ నష్టాన్ని నివారించవచ్చునని తణుకు ప్యానెల్ న్యాయవాదులు సూచించారు. మంగళవారం స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డులోని మార్కెట్ ఏరియాలో ఛైర్మెన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆదేశాల మేరకు తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులు, ట్రాఫిక్ పోలీసు అధికారులు హెల్మెట్ ధరించుదాం, ప్రాణాలు కాపాడుకుందాం అనే నినాదంతో హెల్మెట్ ప్రయోజనాలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు తెలుసుకోవాలని, లైసెన్సు లేకుండా, 18 సంవత్సరాలు నిండకుండా వాహనాలు నడుపరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ జనా సతీష్, పోలీస్ సిబ్బంది, ప్యానెల్ న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, కామన మునిస్వామి, ముప్పిడి సుబ్బయ్య, ఉండ్రాజవరపు రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

ఉచితమే.. అ'ధర'హో..!

ఉచిత ఇసుక విధానంపై జనాల్లో తీవ్ర చర్చ

ఏలూరు జిల్లాలో మూడు స్టాక్‌పాయింట్ల నుంచి ఇసుక సరఫరా

చేబ్రోలు స్టాక్‌పాయింట్‌లో టన్ను ఇసుక రూ.538

వింజరం, ఇబ్రహీంపేట స్టాక్‌పాయింట్లలో ధర తగ్గినా రవాణా ఛార్జీల మోత

గతానికి.. ఇప్పటికీ ధరలో పెద్దగా తేడా లేదంటూ అంతా పెదవి విరుపు

పశ్చిమలో ఇసుక నిల్వలు లేకపోవడంతో తూర్పు, కోనసీమ జిల్లా నుంచే దిక్కు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఇసుక ఉచితమే.. ధర అధరహో అన్నట్లు ప్రభుత్వం తెచ్చిన ఇసుక పాలసీ విధానం ఉండడంతో జనాల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతానికి ఇప్పటికీ ధరలో పెద్దగా తేడా లేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. దీంతో ప్రభుత్వం తెచ్చిన ఉచిత ఇసుక విధానం జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తాము అధికారంలోకి వస్తే ఉచితంగా ఇసుక ఇస్తామంటూ టిడిపి కూటమి ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగా ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి తెచ్చింది. జిల్లా కలెక్టర్ ఛైర్మన్‌గా జిల్లా కమిటీలను సైతం నియమించింది. ప్రస్తుతం స్టాక్‌పాయింట్లలో ఉన్న ఇసుకను ఉచితంగా అందించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలో అమల్లోకి వచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని పరిశీలిస్తే ప్రజలకు పెద్దగా ప్రయోజనంలేని విధంగా ఉందన్న చర్చ నడుస్తోంది. ఏలూరు జిల్లాలో ఓపెన్ ఇసుక రీచ్‌లో లేవు. దీంతో ఉంగుటూరు మండలం చేబ్రోలు, కుక్కునూరు మండలం వింజరం, ఇబ్రహీంపేటలో ఉన్న మూడు స్టాక్ పాయింట్ల నుంచి ఇసుక సరఫరా చేయాలని జిల్లా కమిటీ నిర్ణయించింది. చేబ్రోలు స్టాక్ పాయింట్‌లో పెద్దగా ఇసుక నిల్వలు లేవని తేలిపోయింది. ఉన్న ఇసుక సైతం నాణ్యత లేనిదిగా ఉంది. వింజరంలో ఇసుక డిపో వద్ద 1500 టన్నులు, ఇబ్రహీంపేట డిపో వద్ద 75 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందని తేల్చారు. ఈ పాయింట్ల నుంచి ఇసుక సరఫరాకు సంబంధించి ధరలను కమిటీ నిర్ణయించింది. ఎగుమతి ఖర్చు, ఇసుక డిపోకు చేరవేత వంటి ఖర్చుల ఆధారంగా ఈ ధర నిర్ణయించినట్లు చెబుతున్నారు. చేబ్రోలు స్టాక్ పాయింట్ వద్ద టన్ను ఇసుక ధర రూ.538గా, వింజరం స్టాక్‌పాయింట్ వద్ద రూ.362, ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ వద్ద టన్ను ఇసుక రూ.210 ధర నిర్ణయించి బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ ఇసుక సరఫరా చేయబడునని బోర్డులపై పేర్కొన్నారు. ఒక్క రోజులో ఒక వ్యక్తికి 20 టన్నుల ఇసుక మాత్రమే తీసుకోవడానికి అనుమతి అని నిబంధనలు విధించారు. ఇసుక టన్నుకు నిర్ణయించిన ధరలు చూసి జనం విస్తుపోతున్న పరిస్థితి నెలకొంది. చేబ్రోలు డిపో నుంచి గతంలో టన్ను ఇసుక ధర రూ.750 వసూలు చేసేశారు. రవాణా ఛార్జీలతో కలుపుకుంటే 20 టన్నులు కలిగిన ఆరు యూనిట్ల లారీ ఇసుక ధర రూ.18 వేల వరకూ ఉండేది. ఇప్పుడు రూ.538 ధర నిర్ణయించడంతో రవాణా ఛార్జీలతో కలిపి రూ.15 వేలకు పైగా ఖర్చవుతోంది. ఉచిత ఇసుక అని చెబుతున్నా ధరలో పెద్దగా తేడా కనిపించడం లేదు. వింజరం, ఇబ్రహీంపేట డిపోల వద్ద టన్ను ఇసుక ధర తక్కువగా ఉన్నప్పటికీ అక్కడ నుంచి ఏలూరు జిల్లాలో ఏ గ్రామానికి తీసుకెళ్లాలన్న వంద కిలోమీటర్లకుపైగా దూరం ఉంది. దీంతో రవాణా ఛార్జీలు తడిసి మోపెడవనున్నాయి. ఉచిత ఇసుక విధానం అని చెబుతున్నప్పటికీ భారీగా సొమ్ములు చెల్లించాల్సి రావడంతో జనం పెదవి విరుస్తున్నారు. ముందు ముందు ధరలు పెంచితే ఉచిత ఇసుక విధానంతో జనానికి పెద్దగా ప్రయోజనం ఉండదని స్పష్టమవుతోంది.



ఉంగుటూరు మండలం చేబ్రోలు ఇసుక డిపో

'పశ్చిమ'లో పరిస్థితి మరింత దారుణం

ఉచిత ఇసుక విధానం రాష్ట్ర వ్యాప్తంగా అమలైనా 'పశ్చిమ'లో మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. ఈ జిల్లాలోని ఆచంట మండలంలో కోడేరు, కరుగోరుమిల్లి, పెనుగొండ మండలంలో సిద్ధాంతంలో రెండు, నడిపూడిలో రెండు మొత్తం ఆరు ఓపెన్ ఇసుక రీచ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఇవన్నీ మూతపడ్డాయి. అనుమతులు వచ్చే వరకూ ఇవి తెరుచుకునే అవకాశం లేదు. నరసాపురం, యలమంచిలిలో ఐదు డి-సిల్టేషన్ పాయింట్లు ఉన్నప్పటికీ అవి ప్రస్తుతం పనిచేయడం లేదు. దీంతో జిల్లాలో ఉచిత ఇసుక విధానం ప్రారంభం కాలేదు. భీమవరం, నరసాపురం పట్టణాలకు 50 నుంచి 60 కిలోమీటర్ల దూరం తూర్పుగోదావరి జిల్లాలో మూడు ఇసుక కేంద్రాలు ఉన్నాయని ఇవి ఐదు మండలాలకు అతి సమీపంలో ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. నిడదవోలు మండలం పందలపర్రు, పెరవలి మండలంలోని పెండ్యాల, ఉసులుమర్రులో ఇసుక అందుబాటులో ఉందని అక్కడ నుంచి తెచ్చుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. కోనసీమ జిల్లాలో మూడు ఇసుక ర్యాంపులు మరో ఐదు మండలాలకు దగ్గరగా ఉన్నాయని, రావులపాలెం మండలంలో రావులపాడు -1, 2, కొత్తపేట కేంద్రంలోనూ ఇసుక అందుబాటులో ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతో పశ్చిమగోదావరి జిల్లా ప్రజానీకం ఇసుక సరఫరాకు పక్క జిల్లాలపై ఆధార పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆయా డిపోల్లో నిర్ణయించిన ధర ప్రకారం కొనుగోలు చేసి రవాణా చేసుకుంటే గతానికీ, ఇప్పటికీ పెద్దగా తేడా ఉండదన్న అభిప్రాయం అక్కడి ప్రజల్లోనూ వ్యక్తమవుతోంది. దీంతో ఉచిత ఇసుక విధానం జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

పారిశుధ్య కార్యక్రమాలు..
యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి
జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

కాలానుగుణ వ్యాధుల నుంచి రక్షణ పొందేందుకు విస్తృతంగా పారిశుధ్య కార్యక్రమాలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ మున్సిపల్, పబ్లిక్ హెల్త్ అధికారులతో సమావేశమై ఆయా శాఖల్లో జరుగుతున్న కార్యక్రమాలపై సమీక్షించారు. జిల్లా అంతటా కంటికి కనిపించేంత స్పష్టంగా పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. వర్షాకాలం నేపథ్యంలో డయేరియా, డెంగీ తదితర విష జ్వరాలు అపరిశుభ్రత, నీటి కలుషితం కారణంగా ప్రబలుతాయన్నారు. ఎక్కడా చెత్తకుప్పలు, తాగునీటి పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా చూడాలన్నారు. వీధుల్లో, షాపులు ముందు, డ్రెయినేజీల్లో చెత్త వేయకుండా నిర్దేశించిన ప్రదేశాల్లో మాత్రమే చెత్త వేసేలా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ రీజనల్ డైరెక్టర్ సిహెచ్.నరసింహరాజు, పబ్లిక్ హెల్త్ ఎస్ఇ ఎ.సుధాకర్, మున్సిపల్ కమిషనర్ శ్యామల, ఇఇ త్రినాధరావు, పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారి విజయ్ పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

పంచాయతీల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యతివ్వాలి

పంచాయతీల్లో పరిశుభ్రతకు తగిన ప్రాధాన్యతివ్వాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి సూచించారు. కలెక్టరేట్లో కలెక్టర్ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాలోని ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ సెక్రటరీలతో పంచాయతీల్లో పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణపై సమీక్షించారు. గ్రామాల్లో నూరు శాతం పారిశుధ్య కార్యక్రమాలు కచ్చితంగా జరగాలన్నారు. చెత్త మేట వేసిన ప్రదేశాలను గుర్తించి జెసిబిలను ఉపయోగించి ట్రాక్టర్ల ద్వారా తరలించాలన్నారు. శానిటేషన్ లోపిస్తే ఆ ప్రాంతంలో డయేరియా, డెంగీ, జ్వరాలు విజృంభిస్తాయని, ఇటువంటి పరిస్థితి రాకముందే నియంత్రణ చర్యలను కట్టుదిట్టంగా చేపట్టాలని తెలిపారు. వర్షాల కారణంగా కొబ్బరి బొండాలు, టైర్లు, కుండీలు తదితరాల్లో నీరు నిల్వ జాగ్రత్త పడాలన్నారు. డ్రెయిన్లలో నీటిపారుదలకు ఆటంకం లేని విధంగా డీసిల్టింగ్ చేయాలన్నారు. పంచాయతీ స్థాయిలో పరిష్కరించాల్సిన చిన్న చిన్న సమస్యలు కూడా జిల్లా స్థాయి గ్రీవెన్స్‌కు వస్తున్నాయని, ఇటువంటి వాటిపై పంచాయతీ సెక్రటరీలు, ఇఒపిఆర్‌డిలు తగు శ్రద్ధ తీసుకొని న్యాయబద్ధంగా పరిష్కరించాలని సూచించారు. ఈ కన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీ అధికారి విక్టర్, ఇన్‌ఛార్జి జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి వివి.నాగేశ్వరరావు, డిఎల్‌డిఒ అప్పారావు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలకు కృషి చేయాలి : డిఆర్ఒ

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో కుష్టువ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు కృషి చేయాలని డిఆర్ఒ జె.భాస్కరరావు అన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో డిఆర్ఒ వివిధ శాఖల అధికారులతో కుష్టు వ్యాధి నిర్మూలనపై సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఆర్ఒ మాట్లాడుతూ జిల్లాలో కుష్టు వ్యాధి వ్యాప్తి చెందడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా ఈ నెల 18 నుంచి ఆగస్టు 2వ తేదీ వరకూ జిల్లాలో ఇంటింటా సర్వే చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం ద్వారా వ్యాధిని చాలా వరకూ అరికట్టవచ్చని, వ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించవచ్చని సూచించారు. దీనికోసం వివిధ ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఈ వ్యాధి కారణాలు, చికిత్స, నివారణా చర్యలను ప్రజలకు వివరించాలని కోరారు. అనంతరం వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డి.ఉమా మహేశ్వరరావు, జిల్లా సహాయ వైద్యాధికారి బి.భాను నాయక్, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి బి.సుజాతరాణి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, డిపిఎంఒ సిహెచ్ ధనలక్ష్మి, టిహెచ్ వరల్డ్ ఎంఒ ఎ.భరత్ పాల్గొన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణకు సహకరించాలి
జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రవీణ్ ఆదిత్య

ప్రజాశక్తి - భీమవరం

బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు వర్తకులు సహకారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సివి ప్రవీణ్ ఆదిత్య కోరారు. రైతు బజార్లు, రిలయన్స్, డిమార్టు, సూపర్ మార్కెట్లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్లో జెసి సంబంధిత అధికారులు, రిటైల్ అమ్మకందారులతో సమావేశమై బహిరంగ మార్కెట్లో నిత్యావసర వస్తువుల ధర స్థిరీకరణపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బహిరంగ మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరల పెరుగుదలను నియంత్రించడంలో భాగంగా, జిల్లాలోని అన్ని రైతు బజార్లు, డిమార్ట్, రిలయన్స్, సూపర్ మార్కెట్ల వద్ద ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి, రేట్ల వివరాలను అందరికీ కనబడేలా బోర్డులను డిస్ప్లే చేయాలన్నారు. బియ్యం, కందిపప్పు ప్రజానీకానికి మార్కెట్ ధరల కంటే తక్కువ ధరకు అమ్మకాలు చేయాలని ఆదేశించారు. జిల్లాల్లో పప్పుల వ్యాపారం చేస్తున్న అందరూ హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు ఈ నెల 12వ తేదీలోగా వారి వద్ద ఉన్న అన్ని రకాల పప్పుల నిల్వలను భారత ప్రభుత్వం వారి వెబ్ పోర్టల్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, డిఎస్ఒ ఎన్.సరోజ, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ టి.శివరామ ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, ఎఎస్ఒ ఎం.రవిశంకర్, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జెసి ప్రవీణ్ ఆదిత్య

భూ సేకరణలో ఎన్యుమరేషన్ నిర్వహించాలి

జాతీయ రహదారుల భూసేకరణలో ఎన్యుమరేషన్ కచ్చితత్వంతో నిర్వహించాలని జెసి సివి ప్రవీణ్‌ఆదిత్య సర్వే అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జెసి సర్వే అధికారులతో సమావేశమై పలు అంశాలపై సమీక్షించారు. నేషనల్ హైవేస్ భూ సేకరణలో భాగంగా ఆయా భూముల్లో ఉన్న ఇళ్లు, షెడ్లు, చెట్లు వంటి వాటిని కచ్చితంగా లెక్కించాలన్నారు. భూసేకరణలో భాగంగా ఎన్యుమరేషన్ నిర్వహించేందుకు కమిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని, కమిటీలో ఇచ్చిన నివేదికను తిరిగి తనిఖీ చేసేందుకు మరో కమిటీలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. కిపీడు, ఉండి, కాళ్ల, భీమవరం, పాలకొల్లు, పాలకోడేరు, వీరవాసరం మండలాల్లో భూసేకరణ పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ కె.శ్రీనివాసులు రాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా, జిల్లా ఆర్అండ్‌బి అధికారి ఎస్.లోకేశ్వరరావు, డిప్యూటీ సర్వే అధికారులు, మండల సర్వేలు అధికారులు పాల్గొన్నారు.

ఆలోచనలతోనే అద్భుత ఆవిష్కరణలు
నిట్ రిజిస్ట్రార్ దినేష్ శంకర్ రెడ్డి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆలోచనలకు పదును పెడితే అద్భుత ఆవిష్కరణలు రూపు దిద్దుకుంటాయని నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. ఎపి నిట్, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఇన్‌స్పైర్ మనాక్ మెంటార్ షిప్ - 2024 అనే అంశంపై రెండు రోజులుగా నిర్వహిస్తున్న వర్క్ షాప్ మంగళవారం సాయంత్రంతో ముగిసింది. ఈ సందర్భంగా దినేష్ శంకర్‌రెడ్డి మాట్లాడుతూ వైజ్ఞానిక స్పృహతోనే దేశాభివృద్ధి సాధ్యమని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీయడానికి ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. విద్యార్థుల ఆలోచనలు, ఆవిష్కరణలే దేశ అభ్యున్నతికి వెన్నుదన్నుగా నిలుస్తాయని, ప్రతి విద్యార్థీ విభిన్న ఆలోచనలు చేయాలని సూచించారు. పాఠశాల స్థాయిలోనే సరికొత్త ఆలోచనలు అంకురించి నవ కల్పనకు బాటలు వేయాలని చెప్పారు. కష్టపడి చదివిన వారికి తగిన గుర్తింపు, ప్రతిఫలం తప్పనిసరిగా లభిస్తుందన్నారు. కొలువుల సాధనకు సాంకేతిక నైపుణ్యాలే కీలకమని, ప్రతి విద్యార్థీ బాల్యం నుంచే ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకునే స్థాయికి ఎదగాలని తెలిపారు. మెదడు ఎల్లప్పుడూ చురుగ్గా పనిచేయాలని కోరుకునే విద్యార్థులు పుస్తకాలతో స్నేహం చేయాలని వివరించారు. నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్ సునీల్ భాస్కర్, సైంటిఫిక్ స్టూడెంట్స్ సొసైటీ ప్రెసిడెంట్ ఎస్‌జి.శ్రీనివాస్, ఎస్ఇఆర్‌టి స్టేట్ నోడల్ ఆఫీసర్లు భాగ్యశ్రీ, డాక్టర్ మేరీ మాట్లాడుతూ విద్యార్థుల భాగస్వామ్యంతోనే దేశ ప్రగతి సాధ్యమని, విద్యార్థుల ఆలోచనల్లో ఎల్లప్పుడూ చైతన్య క్రాంతి ప్రసరించాలని తెలిపారు. జాతీయ స్థాయికి ఎంపికైన ఈ 24 మంది విద్యార్థులు ఆగస్టులో ఢిల్లీలో తమ ఆవిష్కరణలను ప్రదర్శించాల్సి ఉంటుందని వివరించారు. పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు, వారి మార్గదర్శకులు మాట్లాడుతూ తమ విద్యార్థులకు తెలియని ఎన్నో విషయాలను ఆచార్యులు తెలియజేశారన్నారు. అనంతరం విద్యార్థులకు ధ్రువపత్రాలను అందజేశారు. ముందుగా ఆచార్యుల బృందం విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలించడంతో పాటు ఆయా ప్రాజెక్టులను సమాజ అవసరాలకు అనుగుణంగా మరిన్ని మెరుగులు దిద్దడానికి అవసరమైన సలహాలు, సూచనలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ పి.శంకర్, కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. ఆచార్యులు డాక్టర్ వి.సందీప్, డాక్టర్ శ్రీఫణికృష్ణ కర్రి, కార్తికేయ శర్మ, డాక్టర్ వినోత్ కుమార్ రాజా, డాక్టర్ భరణీ దరన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ దినేష్ శంకర్‌రెడ్డి

బ్యాంకర్లు లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి
జిల్లా కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్యాంకర్లకు కేటాయించిన లక్ష్యాల మేరకు లబ్ధిదారులకు నూరు శాతం రుణాలను మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ సి.నాగరాణి ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా సంప్రదింపుల కమిటీ, జిల్లాస్థాయి సమీక్ష కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బ్యాంకర్లంతా లక్ష్యాలను చేరుకోవడం చాలా ముఖ్యమని, రైతులు, మహిళలకు, వివిధ వర్గాల ప్రజలకు ఎలాంటి ఉపాధి అవకాశాలు కలిగించామనేది ఆలోచించాలని, కొన్ని బ్యాంకులు రుణాలు మంజూరులో తాత్సారం చేయడం తగదన్నారు. ముద్ర వీవర్స్ రుణాలకు సంబంధించి అన్ని బ్యాంకులు లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. కౌలు రైతులకు అందించే సిసిఆర్‌సి కార్డులకు సంబంధించి రుణాల మంజూరులో అర్హులైన ప్రతి ఒక్కరికీ రుణాలు అందించాలన్నారు. విద్య రుణాలు, వ్యవసాయ సదుపాయాలు, స్వానిధి, రివర్స్ రుణాలు, ఎంప్లాయిమెంట్ జనరేషన్ రుణాలు, పిఎంఇజిపి, విశ్వకర్మ, హార్టికల్చర్ కింద ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం రుణాల మంజూరు, తదితర అన్ని రకాల పథకాల కింద పూర్తి స్థాయిలో లక్ష్యాలను చేరుకోవాలన్నారు.



జిల్లాస్థాయి సమీక్ష కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటుకు అనుమతి

జిల్లా విభజన అనంతరం పశ్చిమగోదావరి జిల్లాలో కూడా ప్రత్యేకంగా రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్‌ను ఏర్పాటు చేయుటకు అనుమతిని మంజూరు చేయడం జరిగిందన్నారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో ఇనిస్టిట్యూట్ నిర్మాణ పనులు జరుగుతాయని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిధులను సమకూరుస్తుందని తెలిపారు. యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంచి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఈ శిక్షణా సంస్థ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బ్యాంకర్ల సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయభాస్కరరావు, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ ఎ.నాగేంద్రప్రసాద్, ఆర్‌బిఐ ఎజిఎం ఆర్.హనుమంత కుమారి పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో డిఎంహెచ్ఒ తనిఖీ

పెనుమంట్ర : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి.ఉమామహేశ్వర్ మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక కేంద్రంలోని వైద్యులు డాక్టర్ లావణ్య, డాక్టర్ కనక ప్రియ, సిబ్బందికి సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగించాలని ఆదేశించారు. ముఖ్యంగా హైరిస్క్ గర్భవతుల రిజిస్టర్లను పరిశీలించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల గురించి గ్రామాల్లో తీసుకుంటున్న జాగ్రత్తలు గురించి తెలుసుకున్నారు. ప్రతి గ్రామంలో వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి వారి ఆరోగ్య పరిస్థితులను గుర్తించుచున్నారా లేదా అని అడిగినట్లు తెలిపారు. అతిసార వ్యాధి, డెంగీ, మలేరియా చికెన్ గున్యా వంటి లక్షణాలు గురించి ప్రజలకు వివరించి వ్యాధులు పట్ల ప్రజలకు పూర్తిగా అవగాహన కల్పించాలని ఆయన పేర్కొన్నారు.

పోలింగ్ బూత్ మార్చాలని వినతి

మొగల్తూరు : మండలంలోని రామన్నపాలెంలో ఉన్న పోలింగ్ బూత్‌ను లక్కువ వారి తోటకు మార్చాలని కోరుతూ మంగళవారం ఆర్‌డిఒ అచ్యుత్ అంబరీష్‌కు వినతిపత్రం అందించామని గ్రామానికి చెందిన అడ్డాల రాంబాబు తెలిపారు. లక్కు వారి తోటలో 971 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. సుమారు మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న రామన్నపాలెంలో పోలింగ్ బూత్ ఉందని తెలిపారు. లక్కు వారి తోట నుంచి రామన్నపాలెం వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం కూడా లేదన్నారు. లక్కు వారి తోటలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని సబ్ కలెక్టర్ కోరేమన్నారు. ఆయన వెంట ఎ.సోమ లింగేశ్వరరావు, పి.దుర్గాప్రసాద్, కె.ప్రసాద్ ఉన్నారు.

డ్రెయినేజీ అస్తవ్యస్తం : సిపిఎం

కాళ్ల: జువ్వలపాలెం గ్రామంలో సంత మార్కెట్ వీధిలో డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారడంతో వర్షపు, మురుగు నీరు రోడ్లపై రోజుల తరబడి నిల్వ ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సిపిఎం మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. జువ్వలపాలెం గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థను మంగళవారం పరిశీలించారు. డ్రెయినేజీ సమస్యపై అధికారులకు అనేకసార్లు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని స్థానికులు వాపోతున్నారన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీ నీరు మురుగు కాలువలోకి వెళ్లకుండా కొంతమంది పెత్తందారులు డ్రెయినేజీకి అడ్డుకట్టలు వేయడం సరైనది కాదన్నారు. కొద్దిపాటి వర్షానికి రోడ్లపై వర్షపు నీరు రోజుల తరబడి పొంగి పొర్లుతుండడంతో ప్రజలు, విద్యార్థులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. డ్రెయినేజీ సమస్యపై ఎంపిడిఒ జి.స్వాతి, గ్రామ కార్యదర్శి జిఎస్.రామరాజులతో ఫోన్‌లో మాట్లాడారు. డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమిస్తామన్నారు. డ్రెయినేజీ పరిశీలనలో సిపిఎం మండల కమిటీ సభ్యులు తిరుమాని శ్రీనివాసరావు, గండికోట వెంకటేశ్వరరావు ఉన్నారు.


నేడు ఈది రామారావు స్థూపం ఆవిష్కరణ

ప్రజాశక్తి - పోడూరు, ఆచంట

నిస్వార్థ ప్రజా సేవకుడు, అమరజీవి ఈది రామారావు(స్టీవెన్) నూతన స్మారక స్థూపం పోడూరు మండలం పోడూరు పంచాయతీ పరిధి సంత మార్కెట్ వద్ద ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు జరుగుతుందని సిపిఎం మండల కార్యదర్శి పిల్లి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సిపిఎం ఆచంట నియోజకవర్గ మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్, ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు. కావున ఈ కార్యక్రమానికి సిపిఎం శ్రేణులు, వామపక్ష అభిమానులు ప్రజాస్వామ్యవాదులు, ప్రజానీకం అంతా వందలాదిగా తరలివచ్చి ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని పిల్లి ప్రసాద్ పిలుపునిచ్చారు.

ఈది రామారావు జీవిత చరిత్ర..

పోడూరు మండలం పోడూరు గ్రామ పంచాయతీ పరిధి పెద్ద పేటలో 1920 ఏప్రిల్ 4వ తేదీన జన్మించారు. అతి చిన్న వయసులో ఈయన బర్మా దేశం వెళ్లిన సందర్భంగా కమ్యూనిస్టు సభ్యత్వాన్ని బర్మా దేశంలో తీసుకుని సేవలందించారు. అనంతరం భారతదేశం వచ్చిన తరువాత ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పని చేశారు. సిపిఎం ఏర్పడిన తర్వాత నరసాపురం తాలూకా కన్వీనర్‌గా, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులుగా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పాటు పనిచేసి అందరి మన్ననలు పొందారు. తన యావత్ జీవితాన్ని ప్రజా ఉద్యమానికి అంకితం చేసి నీతి నిజాయితీకి మారుపేరుగా, నిస్వార్థ ప్రజా సేవకుడుగా, వ్యవసాయ కార్మికులు, దళితులు, అణగారిన ప్రజానీకం సమస్యలు పరిష్కారం చేయడంలో ముందుండి పని చేశారు. 1983లో ఆచంట అసెంబ్లీ నియోజకవర్గానికి సిపిఎం తరపున ఎంఎల్ఎగా పోటీ చేసి గణనీయమైన ఓట్లు సాధించారు. ఈది రామారావుకు భార్య లక్ష్మమ్మ, పెద్ద కుమార్తె గుండె అరుణమాల, అల్లుడు వెంకట రామభద్రం, చిన్న కుమార్తె వనపర్తి స్వర్ణమాల, అల్లుడు జ్యోతే రావులు రామారావు పట్ల ఎంతో ఆప్యాయత అనురాగంతో ఉండేవారు. రామారావు వృద్ధాప్యాన్ని లెక్కచేయకుండా ప్రజా ఉద్యమంలో పని చేసిన నిస్వార్థ ప్రజా సేవకుడిగా 2008 జూన్ 28వ తేదీన ఆయన చిన్న కుమార్తె ఇంటి వద్ద తుది శ్వాస విడిచారు. ఈయన పేరుతో పోడూరు మండలం పోడూరు పంచాయతీ పరిధి పెద్ద పేట సంత మార్కెట్ వద్ద ఆయన జ్ఞాపకార్థం నిర్మించిన నూతన స్మారక స్థూపాన్ని ఈనెల మధ్యాహ్నా 12 గంటలకు ప్రారంభించి, అనంతరం సభా కార్యక్రమం నిర్వహించినట్లు శాఖా కార్యదర్శి బొంతు శ్రీనివాస్, గ్రామ నాయకులు బి.వెంకట్రావులు తెలిపారు.



స్టీవెన్ ఫైల్ ఫొటో

జిల్లాలో 156.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు

ప్రజాశక్తి - నరసాపురం

జిల్లాలో గడిచిన 24 గంటల్లో నమోదైన వర్షపాతం వివరాలను మంగళవారం అధికారులు వెల్లడించారు. పాలకోడెరు 22.8, ఉండి 19.6, భీమవరం 14.6, అత్తిలి 13.4, తణుకు, పోడూరు 12.2, పాలకొల్లు 8.2, గణపవరం 7.8, ఆకివీడు 6.2 మిల్లీమీటర్లు జిల్లాలోని మొత్తం 20 మండలాల్లో 156.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు అయిందని అధికారులు తెలిపారు. జిల్లా యావరేజ్ వర్షపాతం 7.8 మిల్లీమీటర్లు నమోదైంది.

నేషనల్ స్థాయి పోటీలకు ఎంపికైన జశ్వంత్

తాడేపల్లిగూడెం: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో 9వ తరగతి చదువుతున్న జి.జశ్వంత్ వెంకట సాయి ఫుట్‌బాల్ జూనియర్ నేషనల్ ఛాంపియన్‌షిప్‌కు పాఠశాల ప్రిన్సిపల్ ఎం.ఉమా శ్రీనివాస్ ఎంపికైనట్లు తెలిపారు. ఈనెల 10 నుంచి 23 వరకు అనంతపురంలో జరుగు క్యాంపులో పాల్గొంటాడని, సెలక్షన్ అనంతరం ఈనెల 23 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు 'అస్సాం' లో జరుగు నేషనల్ ఫుట్ బాల్ పోటీలలో మన రాష్ట్రం తరపున పాల్గొంటాడని తెలిపారు. ఈ సందర్భంగా సంస్థ ఛైర్మన్ చెరుకువాడ వెంకట నరసింహరాజు, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గ్రంధి నాగ వెంకట మణికుమార్, ప్రిన్సిపల్ నానెల్లి ఉమా శ్రీనివాస్ జశ్వంత్‌కు అభినందనలు తెలియజేశారు.

విద్యార్థులకు కిట్లు అందజేత

వీరవాసరం: ప్రతీ విద్యార్థి ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా ఉన్నత విద్యనభ్యసించి, తమ లక్ష్యాలను చేరుకోవాలని జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, వీరవల్లి దుర్గాభవాని చంద్రశేఖరులు విద్యార్థులకు సూచించారు. దూసనపూడి, మత్స్యపురి జిల్లా పరిషత్ హైస్కూల్లో స్టూడెంట్ కిట్స్ పంపిణీ కార్యక్రమంలో జెడ్‌పిటిసి, ఎంపిపి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి కార్యక్రమంలో పాల్గొని భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు కొనకాల్లి శాంతిప్రియ, నాగేశ్వరు, వైస్ ఎంపిపి ప్రకాశరావు, ఎంపిటిసి ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

టెక్ మహీంద్రాకు ఆదిత్య విద్యార్థుల ఎంపిక

తాడేపల్లిగూడెం: స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో ప్రముఖ మల్టీ నేషనల్ కంపెనీ అయిన టెక్ మహీంద్రా క్యాంపస్ నియామకాలు జరిపినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.లక్ష్మి సరోజ తెలిపారు. ఈ క్యాంపస్ నియామకాలకు జిల్లాలోని ఐదు కళాశాలల నుంచి(తాడేపల్లిగూడెం, పాలకొల్లు, భీమవరం, ఏలూరు) సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇంటర్వ్యూలలో 50 మంది విద్యార్థులను ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ లక్ష్మీ సరోజ తెలిపారు. పటిష్టమైన విద్యా ప్రణాళికలో భాగంగా తాము అందించే సిఆర్‌టి శిక్షణ వల్ల విద్యార్థులు(2023-24)లో 500కుపైగా ఉద్యోగాలు క్రమంగా చేసుకున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. ఆదిత్య అందరికీ ఉద్యోగాలే తమ విద్యార్థులు మరోసారి నిరూపించారని ఆదిత్య కళాశాల డైరెక్టర్ కె.శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఉద్యోగాలకు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, సెక్రటరీ ఎన్.సుగుణా రెడ్డి అభినందించారు.

'అక్రమ వసూళ్లను నివారించాలి'

పెనుగొండ: గుర్తింపును ధ్రువీకరించడానికి ఇకెవైసి కోసం ప్రతి వంట గ్యాస్ వినియోగదారు నుంచి రూ.10 చొప్పున ఇండియన్ గ్యాస్ డీలర్ వసూలు చేస్తున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి షేక్ పాదుషా విమర్శించారు. మంగళవారం ఇదియం తన ఇకెవైసి ధ్రువీకరణకు వెళ్లిన పాదుషా నుంచి పది రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారన్నారు. ప్రతి గ్యాస్ వద్ద పది రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారని పలువురు ఇండియన్ గ్యాస్ వెంకటేశ్వర కంపెనీ డీలర్ ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేయడం వెంటనే నిలుపుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

'గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి'

పాలకొల్లు రూరల్: లంకలకోడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ అడ్డాల ప్రతాప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో పాలకొల్లు ప్రయివేట్ హాస్పటల్ డాక్టర్ లక్ష్మీ భార్గవి గర్భిణులకు ప్రమాదకర లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ భార్గవి మాట్లాడుతూ గర్భిణులు బిపి, షుగర్, కాళ్ళ వాపు లక్షణాలు గల వారు తగు జాగ్రత్తలు తీసుకుని పోషకాహారంలో మార్పులు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నవ్య జేసన్, ఆరోగ్య విస్తరణ అధికారి గుడాల హరిబాబు, పిహెచ్ఎన్ పి ఎలిజబెత్ పాల్గొన్నారు.

కెవికెలో ముగిసిన స్వర్ణోత్సవాల జ్యోతి యాత్ర

ఉండి: రైతులకు ఆధునిక పద్ధతిలో వ్యవసాయం చేయడం నేర్పించి వ్యవసాయ రంగంలో అగ్రగామిగా నిలిపేందుకే కృషి విజ్ఞాన కేంద్రాలు స్థాపించబడ్డాయని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు అన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎన్.మల్లికార్జున రావు మాట్లాడుతూ మంగళవారం ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో స్వర్ణోత్సవాల జ్యోతి యాత్ర కార్యక్రమాలు ముగియడంతో స్వర్ణోత్సవ జ్యోతి యాత్రను ఘంటసాలకు పంపించడం జరిగిందని ఆయన చెప్పారు. 1995వ సంవత్సరంలో ఉండిలో ఏర్పాటైన కృషి విజ్ఞాన కేంద్రం ఉండి పరిసర ప్రాంత ప్రజలకు కొత్త వరి వంగడాలను సృష్టించి వారికి తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను ఆర్జించేందుకు సహకరిస్తున్నాయని అన్నారు. ప్రతి జిల్లాలోనూ కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసి లాభసాటి వ్యవసాయం చేసేందుకు రైతులను వ్యవసాయం వైపు మళ్లించేందుకు కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

'వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి'

కాళ్ల: గ్రామ పంచాయతీలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఈ గ్రామ సర్వర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా పంచాయతీ వనరులకేంద్రం రిసోర్స్ పర్సన్ కెఎస్ఎస్.రామలక్ష్మి సూచించారు. ఏలూరుపాడు గ్రామ పంచాయతీలో ఈ గ్రామ సర్వర్ పోర్టల్‌ను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ పంచాయతీ అవార్డుల ఎంపికకు ప్రతి పంచాయతీ వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. కేంద్రం ఏటా తొమ్మిది క్యాటగిరీల్లో గ్రామ పంచాయతీలకు అవార్డులు ఇస్తుందన్నారు. పేదరికం, జీవన ఉపాధి, హెల్త్, చైల్డ్ అండ్ విమెన్ ఫ్రెండ్లీ, డ్రింకింగ్ వాటర్, శానిటేషన్, గ్రీనరీ, స్వయం సమృద్ధి, సోషల్ సెక్యూరిటీ వంటి అంశాల్లో పంచాయతీల పనితీరు అంచనా వేసి అందిస్తున్నారన్నారు. 2022-23 సంవత్సరాల్లో గ్రామపంచాయతీలో పంచాయతీ సాధారణ నిధులు ఎంతవరకు ఖర్చు చేశారనేది శాతాలవారీగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, గ్రామంలో చేసిన అభివృద్ధి పనులు వివరాలను నమోదు చేయాలని గ్రామ కార్యదర్శులకు సూచించారు. ఈ పరిశీలనలో ఏలూరుపాడు గ్రామ కార్యదర్శి అరుణా దేవి, సచివాలయ గ్రామ కార్యదర్శి నాగమోహిని, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రజ్ఞాశాలి బుల్లిరామయ్య'

తణుకు: పారిశ్రామిక సామ్రాజ్య స్థాపనలో డాక్టర్ బోళ్ల బుల్లిరామయ్య ప్రముఖ ప్రజ్ఞాశాలి అనడంలో ఎటువంటి సందేహం లేదని టిడిపి పట్టణ అధ్యక్షులు కలగర వెంకటకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక తణుకు ఎంఎల్ఎ కార్యాలయం వద్ద ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ కేంద్ర మంత్రివర్యులు డాక్టర్ బోళ్ల బుల్లిరామయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ రాజకీయ రంగంలో, విద్యా రంగంలో, సేవా రంగంలో ఆయన తనదైనటువంటి ప్రత్యేకతను చాటుకున్నటువంటి మహోన్నత వ్యక్తి బుల్లిరామయ్య అన్నారు. పారిశ్రామికవేత్తగా ఆంధ్రా షుగర్స్‌లో ఆయన ప్రస్తానాన్ని ప్రారంభించి, తణుకు పట్టణ పరిసర ప్రాంతాల్లో అనేక మంది యువతకు ఉపాధి కల్పించడంలో బుల్లిరామయ్య మేధాసంపత్తి ఎంతో ఉపయోగపడిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

హరి ప్రసాద్‌ను కలిసిన చాగంటి

నరసాపురం: ఎంఎల్‌సిగా ఇటీవల ఎన్నికైన జనసేన కార్యదర్శి హరిప్రసాద్‌ని విజయవాడలోని జనసేన కార్యాలయంలో మంగళవారం జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ(చిన్నా) మర్యాదపూర్వకంగా కలిశారు. హరి ప్రసాద్‌ను చాగంటి చిన్న సాలువతో సత్కరించి, డ్రై ఫ్రూట్స్, బొకేని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలు రాజకీయ అంశాలపై ఇరువురు చర్చించుకున్నారు. ఈ కార్యక్రమంలో చాగంటి అంజిబాబు, బళ్ల శ్రీను పాల్గొన్నారు.

లే అవుట్ పరిశీలన

మొగల్తూరు : మొగల్తూరు పంచాయతీ పరిధి వడయారు పేటలో ఏర్పాటు చేసిన అక్రమ లే అవుట్‌ను మంగళవారం పంచాయతీ అధికారులు పరిశీలించారు. గ్రామానికి చెందిన సఖినేటిపల్లి చిన్న ఇటీవల స్పందనలో గ్రామంలో అక్రమ లేఅవుట్‌తో పంచాయతీ బోధిని పూడ్చివేసి ఆక్రమించుకుని, లే అవుట్ వేశారని సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు పంచాయతీ సిబ్బంది సర్వే చేశారు. ఇఒపిఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి జి.గంగన్న, సర్వేర్ రాజ్ కుమార్, ఎ.చైతన్య, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన

ఉండి: ధూమపానం, మాదకద్రవ్యాలు సేవించడం వల్ల విద్యార్థులు తీవ్ర అనారోగ్యానికి గురవుతారని ఎస్ఇబి సిఐ కాత్యాయని అన్నారు. మంగళవారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ధూమపానం మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా ఎస్ఇబి సిఐ కాత్యాయని పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశలో ప్రతి ఒక్కరూ చెడు స్నేహాల వల్ల ధూమపానం, మాదకద్రవ్యాలకు బానిసలవుతున్నారని వారు తెలిపారు. యువత చెడువ్యసనాల బారిన పడకుండా తల్లిదండ్రులు పర్యవేక్షించుకోవాలన్నారు. ఉండి ఎస్ఐ ఎం.లక్ష్మణ్, ఎస్ఇబి సిబ్బంది పాల్గొన్నారు.

గీత వృత్తిని కాపాడాలి

ఎపి కల్లు గీతకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - నరసాపురం

తాటిచెట్లకు రక్షణ కల్పించి, గీత వృత్తిని కాపాడాలని నూతన ప్రభుత్వానికి ఎపి కల్లు గీతకార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడపడితే అక్కడ కనిపించే తాటిచెట్లు బుల్‌డోజర్ల దెబ్బకు నేలకు ఒరుగుతున్నాయని, పాలకులు కార్పొరేట్లకు భూములు ఇవ్వటం, రియల్ ఎస్టేట్ వ్యాపారం వల్ల తాటి చెట్లు కూల్చేసి గీత వృత్తిని దెబ్బ తీస్తున్నారని నరసింహమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నరసాపురం సర్కిల్ గీత కార్మికుల విస్తృత సమావేశం మీరా గ్రంథాలయంలో దొంగ గంగాచలం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న నరసింహమూర్తి మాట్లాడుతూ తాటిచెట్లు ఉన్నంత వరకూ గీత కార్మికులు ఉంటారని, గీచేవారు ఉన్నతకాలం పోరాడేందుకు సంఘాలు వుంటాయని అన్నారు. గీత పాలకుల విధానాల వల్ల గీత వృత్తి సంక్షోభంలో పడిందని తెలిపారు. రాష్ట్రంలో నూతనంగా అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వంపై గీత కార్మికులు పెట్టుకున్న ఆశలు నెరవేర్చే దిశగా నూతన కల్లు విధానం రూపొందించాలని కోరారు. బీరు, బ్రాంది, విస్కీలతో కల్లును పోల్చవద్దని, కల్లులో ఎన్నో పోషకాలు, ఓషధ గుణాలు ఉన్నందున ప్రభుత్వం కల్లుకు మార్కెట్‌లో సౌకర్యం కల్పించాలన్నారు. తాటిచెట్ల ద్వారా 200 రకాల ఉత్పత్తులు తయారు చేయవచ్చని, అనేక బై ప్రొడక్టులు చేయవచ్చని శాస్త్రవేత్తలు తెలుపుతున్నందున ప్రభుత్వం అధ్యయన కమిటీ వేయాలని విజ్ఞప్తి చేశారు. తాటి చెట్టుకి రూ.10 చొప్పున పన్ను కట్టించుకొని, గీచేవారికే చెట్టుపై హక్కు కల్పించాలన్నారు. వృత్తిలో ప్రమాదాలు తగ్గించేందుకు సేఫ్టీగా వుండే విధంగా మోకులు ఇవ్వాలని, ప్రమాదం జరిగిన నెల రోజుల్లో ఎక్స్‌గ్రేషియో ఎక్సైజు డిపార్ట్మెంట్ ద్వారా రూ.10 లక్షలు ఇవ్వాలని, వృత్తి చేసే వారందరికీ ద్విచక్ర వాహనములు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఈబడ్జెట్టులో గీత కార్మికుల సంక్షేమానికి రూ.5 వేల కోట్ల నిధులు కేటాయించాలని, కల్లును నిల్వ ఉంచే విధంగా పరిశోధనలు జరపాలని, నిడదవోలులో ఉన్న రాష్ట్ర తాటి బెల్లం రేషనుకు నిధులు కేటాయించి, బెల్లానికి మార్కెట్ సదుపాయం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా సంఘం నాయకులు కడలి పొండు, బొక్కా చంటి మాట్లాడుతూ ఎన్నికల ప్రణాళికలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తాటి ఈత, ఖర్జూర హైబ్రిడ్ చెట్లను ఉపాధి హామీ చట్టం ద్వారా పెంచాలన్నారు. ఈ సమావేశంలో పిచ్చేటి నరసింహ రావు, గుబ్బల విష్ణు, కాగితాల సత్యనారాయణ, ఇర్రింకి వెంకటేశ్వర రావు, బొక్క ఏడుకొండలు, కడలి సత్యనారాయణ పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్‌ను రక్షించాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

దేశంలోని రెండు ప్రధాన టెలికాం సంస్థలు ఒకటి రిలయన్స్, జియో, రెండు ఎయిర్టెల్ సంస్థలు ఈమధ్య రీఛార్జ్ రేట్లు దేశంలో ఉన్న కోటి 80 లక్షల మందికి సుమారు రూ.20 కోట్ల అదనపు భారాన్ని మోపారని తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు సత్తి కోదండరామిరెడ్డి, కార్యదర్శి చిర్ల పుల్లారెడ్డి, ఉపాధ్యక్షులు కర్రి సాయి రెడ్డి అన్నారు. మంగళవారం తాడేపల్లిగూడెం తాలూకా రైల్వే గూడ్స్ షెడ్ వర్కర్స్ యూనియన్ వద్ద వారు మాట్లాడుతూ 2016లో నరేంద్ర మోడీ పెద్ద నోట్లు రద్దు సందర్భంగా ఆ రోజు వచ్చిన ఈ సంస్థలో 2023-24 సంబంధించి రిలయన్స్ రూ.20 వేల 607 కోట్లు లాభాల్లో ఉన్నదని, ఎయిర్టెల్ సంస్థ రూ.7,476 కోట్లు లాభాలలో ఉన్నాయని, ఇంకా ప్రజల మీద భారాలు వేయుటకు ఈ రీఛార్జి రేట్లు పెంచడం జరిగిందన్నారు. 12 శాతం నుంచి 25 శాతం వరకు రేట్లు పెంచారని, వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన బిఎస్ఎన్ఎల్ మారుమూల గ్రామాల్లో కూడా తన సేవలను అందించేదని, ఎక్కడికక్కడ టవర్లు ఏర్పాటు చేసి, తక్కువ రేట్లతో ప్రజలకు మరిన్ని సేవలు అందించారని వారు తెలిపారు. అటువంటి సంస్థ జి ఫోర్, జి ఫైవ్ అంతర్జాతీయ టెక్నాలజీ రాకుండా నరేంద్ర మోడీ ప్రభుత్వం అడ్డుకుంటుందని, బిఎస్ఎన్ఎల్‌లో అలాంటి సౌకర్యాలు లేక కోటి 80 లక్షల మంది ఈ ప్రయివేట్ కంపెనీలకు వెళ్లిపోయారని వారు తెలిపారు. ఇకనైనా కేంద్ర ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ సంస్థను రక్షించాలని, వినియోగదారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ప్రయివేట్ కంపెనీలు పెంచిన రీఛార్జ్ రేట్లను వెంటనే తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కర్రి శ్రీనివాస్ రెడ్డి, ఆకులు నారాయణ, కర్రి సుబ్బిరెడ్డి, ఆడప ఆంజనేయులు, ఎస్‌విఎస్ రెడ్డి, గాది వెంకట్రావు, మద్దాల పుత్రయ్య, బుద్దాల నాని పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ నిర్వహణలో అవకాశమివ్వాలి

ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్

తాడేపల్లిగూడెం: అన్నా క్యాంటీన్ నిర్వహణలో తనకు అవకాశం ఇవ్వాలని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ నిర్వాహకులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం తాడేపల్లిగూడెం తాలూకా ఆఫీస్ సెంటర్‌లో తాడేపల్లిగూడెం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 89వ వారం అన్నా క్యాంటీన్‌కు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ వచ్చే మంగళవారం తాను అన్న క్యాంటీన్ ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసేంతవరకు అన్నా క్యాంటీన్ నిర్వహణలో దాతలు అందరూ సహకరించాలని టిడిపి నేత వలవల బాబ్జీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, జనసేన, టిడిపి, కార్యకర్తలు పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన కనకయ్య

ప్రజాశక్తి - వీరవాసరం


లోకేష్‌తో కనకయ్య

గత వైసిపి ప్రభుత్వ పాలనలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులను విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లినట్టు మత్స్యపురి టిడిపి గ్రామాధ్యక్షుడు చింతా కనకయ్య మంగళవారం తెలిపారు. ఈమేరకు కనకయ్య లోకేష్‌ను కలిసి వైసిపి తమపై పెట్టిన అక్రమ కేసుల విషయం వివరించడం జరిగిందన్నారు. దీనికి లోకేష్ సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలన్ని అమలు చేస్తామని, అందుకనుగుణంగా గ్రామాల్లో పార్టీని బోలోపేతం చేసేందుకు పార్టీ శ్రేణులు ఆ దిశగా కృషి చేయాలని కోరినట్టు తెలిపారు.

డయేరియాపై అవగాహన

ఉండి: ఐదు సంవత్సరాల లోపు పిల్లల్లో పోషకాహార లోపం వల్ల డయేరియా వ్యాధి వస్తుందని యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ బెన్నీ శామ్యూల్ అన్నారు. డయేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉండి మండలం యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డయేరియాపై బాలలు, వారి తల్లిదండ్రులకు అవగాహనా సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ బెన్నీ సామ్యూల్ మాట్లాడుతూ డయేరియా టైగర్ దోమ కాటు వల్ల వస్తుందని, ఈ దోమ పగటిపూట మాత్రమే సంచరిస్తుందని, వీటిని సంహరించాలంటే నీటి నిల్వలు, పరిసరాల అపరిశుభ్రత ఉన్నచోట యాంటీ లార్వెల్ ఆపరేషన్ ద్వారా స్ప్రేయింగ్ చేయాలని ఆయన సూచించారు.

'ఎస్‌సి వర్గీకరణ దుర్మార్గం'

ప్రజాశక్తి - భీమవరం

ముగిసిపోయిన ఎస్‌సి వర్గీకరణ అంశాన్ని మళ్లీ తెరపైకి బిజెపి ప్రభుత్వం తెచ్చి ఎస్‌సి వర్గీకరణ చేస్తాననటం దుర్మార్గపు చర్యని పివి రావు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు గుమ్మాపు సూర్య వరప్రసాదరావు అన్నారు. భీమవరంలో భారీ పరిశ్రమలు, కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మను పివి రావు మాల మహానాడు ఆధ్వర్యంలో సూర్య వరప్రసాదరావు నేతృత్వంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి పొన్నమండ బాలకృష్ణ, జిల్లా అధ్యక్షుడు బండి శ్యామ్ బాబు, మొగల్తూరు మండలం అధ్యక్షుడు ఇంజెటి కుమార్ స్వామి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌సి వర్గీకరణకు సంబంధించిన అంశాలను మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ఈ విషయాలన్నీ ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు.

ప్రజలకు తోడుగా ఉంటా : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం: ప్రజలకు ఏ కష్టం వచ్చినా, ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని, వారి కష్టాల్లో తోడుగా ఉంటానని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. తాడేపల్లిగూడెంలోని బొలిశెట్టి నివాసం వద్ద మంగళవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలు, వార్డుల నుంచి భారీగా వచ్చిన ప్రజలు తమ సమస్యలు చెప్పుకున్నారు. వాటిని పరిష్కరిస్తానని, హామీ ఇవ్వడంతో పాటు త్వరలోనే గ్రామ గ్రామాన అధికారులతో సహ ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రకటించారు.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి దీక్ష పూర్తి చేసుకుని ప్రజల సమస్యలకు పరిష్కారం వెతికే దిశగా పనిచేస్తున్నారని, అమ్మవారి చల్లని చూపు ప్రజలపై తప్పకుండా ఉంటుందని తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు.

మాజీ సర్పంచి రత్నమాణిక్యం మృతి

ఆకివీడు: మండలంలోని బొంగులూరు గ్రామ మాజీ సర్పంచి కోపెల్ల రత్నమాణిక్యం(50) సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందారు. హైదరాబాదులో తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆమె ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. మంగళవారం అంత్యక్రియలు స్వగ్రామంలో నిర్వహించారు. ఆమె సర్పంచిగా ఉన్న కాలంలో గ్రామం రక్షిత మంచినీటి సరఫరా పథకం ద్వారా ప్రత్యేకంగా అదనపు ఫిల్టర్ల ప్లాంట్‌ను ఏర్పాటు చేసి మంచినీటి డబ్బాల(క్యాన్లు) ద్వారా ఇంటింటికీ మంచినీళ్లు అందించే పథకం ప్రారంభించారు. వీటితోపాటు గ్రామంలో పలు ప్రజా రంజకమైన కార్యక్రమాలు చేపట్టి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా అవార్డునందుకున్నారు. రత్న మాణిక్యం మృత దేహాన్ని సందర్శించి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు, టిడిపి మండల అధ్యక్షులు మోటిపల్లి ప్రసాద్, జనసేన నాయకులు ముత్యాల వెంకటేశ్వరరావు, పిల్ల నరసింహ రావు నివాళులర్పించారు.

దాతల సేవలు అభినందనీయం

వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్

కాళ్ల: కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి దాత వీరమల్లు సురేష్ రూ.40 వేల విలువైన వస్తువులను అందజేయడం అభినందనీయమని వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ అన్నారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాస్మా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ ఆధ్వర్యంలో 54 మంది గర్భిణీ స్త్రీలకు వైద్య పరీక్షలు చేసి, లెబరెటరీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన వీరమల్లు సురేష్ దాతృత్వంతో మంచి పోషకాహారంతో కూడిన భోజనం, పండ్లు అందించారు. గర్భిణులకు, వాళ్లతో వచ్చిన సహాయకులకు, పిహెచ్‌సిలో రోగులకు సుమారు రూ.40 వేల విలువగల రెండు సిమెంట్ బెంచ్‌లు, రెండు బెడ్స్, 6 సీలింగ్ ఫ్యాన్లు అందజేశారు. దాత సురేష్ మాట్లాడుతూ ఆసుపత్రిలో సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి వస్తే స్నేహితులతో సమకూర్చటం జరుగుతుందన్నారు. రోగులకు వైద్య సిబ్బంది మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ సరాబు సునీల్ సిబ్బందిచే దాత వీరమల్లు సురేష్‌ని శాలువ, మెమొంటోతో చిరు సత్కారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ డి.సునీత, పిహెచ్‌సి సిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్స్, ఎంఎల్ హెచ్‌పి, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్స్, కాళ్లకూరు గ్రామస్థులు పాల్గొన్నారు.


దాత వీరమల్లు సురేష్‌ను సత్కరిస్తున్న వైద్యాధికారులు

నేడు డిమాండ్స్ డే

తాడేపల్లిగూడెం: మోడీ ప్రభుత్వ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా కార్మికులు, ఉద్యోగులు ఈనెల 10వ తేదీ బుధవారం సిఐటియు ఆధ్వర్యాన తలపెట్టిన ఆల్ ఇండియా డిమాండ్స్ డేకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ సంపూర్ణమైన మద్దతుని తెలియజేస్తుందని సంఘం జిల్లా నాయకులు చింతకాయల బాబురావు, చిర్ల పుల్లారెడ్డి మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గత పదేళ్లలో కార్పొరేట్లకు రూ.17.4 లక్షల కోట్లు కట్టబెట్టిన బిజెపి, రైతాంగం వ్యవసాయ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏ విధమైన చర్యలు తీసుకోలేదని, 4 లేబర్ కోడ్‌లను, రైతాంగానికి నష్టం తెచ్చే రైతు వ్యతిరేక చట్టాలను కేంద్రంలోని బిజెపి తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే ముందుకు తెస్తుందని, అమలుకు చూస్తుందని అన్నారు.

ఆకివీడు : దేశవ్యాప్తంగా ఈనెల 10వ తేదీ బుధవారం తలపెట్టిన డిమాండ్స్ డేను జయప్రదం చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి హసీనా పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో అంగన్వాడీల ప్రాజెక్టు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హసీనా మాట్లాడుతూ మోడీ మూడవ దఫా అధికారంలోకి వచ్చిన తరువాత లేబర్ కోడ్‌లను అమలు చేయడానికి దూకుడుగా ముందుకు వెళుతున్నారన్నారు. డిమాండ్స్ డేని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి మార్తమ్మ, మండల సిఐటియు అధ్యక్షులు పెంకి అప్పారావు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఆచంట: రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన ఉచిత ఇసుక పాలసీ విధానాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య అన్నారు. మంగళవారం స్థానిక టిడిపి కార్యాలయంలో విలేఖరి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక పాలసీని తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. టిడిపి సీనియర్ నాయకులు గొడవర్తి శ్రీరాములు, తెలుగు యువత మండల అధ్యక్షులు కేతా మురళీ, జనసేన మండల అధ్యక్షులు జవ్వాది బాలాజీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నరసాపురం: ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానం వల్ల రాష్ట్రంలో లక్షలాది మంది భవన నిర్మాణదారులకు ఉపాధి దొరకడంతో పాటు నిర్మాణదారులకు ఆర్థికంగా లబ్ధి చేకూరుతుందని నరసాపురం టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. గుబ్బల నాగరాజు, జోగి పండు పాల్గొన్నారు.

పాలకొల్లు : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు పేదలకు ఉచితంగా ఇసుకను అందుబాటులోకి తెచ్చినట్లు పలువురు టిడిపి నేతలు చెప్పారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు, పాలకొల్లు, యలమంచిలి, పోడూరు మండల టిడిపి అధ్యక్షులు కోడి విజయ భాస్కర్, మామిడి శెట్టి పెద్దిరాజు, గొట్టుముక్కల సూర్య నారాయణ రాజులు మంగళవారం మంత్రి నిమ్మల క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు.

రిటైర్డ్ ఎంఇఒ గాంధీ రెడ్డి మృతి

ఆకివీడు: స్థానిక ప్రముఖులు, ఎంఇఒగా ఉద్యోగ విరమణ చేసిన మోర గాంధీ రెడ్డి(75) ఇటీవల మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో వైద్యం చేయించుకుంటూ మృతిచెందిన కుటుంబీకులు తెలిపారు. ఆయన చాలా కాలం పాఠశాల ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎంఇఒగా ఉద్యోగోన్నతి పొంది ఉద్యోగ విరమణ చేశారు. ఆయనకు ఇద్దరు కుమారులు, భార్య ఉన్నారు. గాంధీ రెడ్డి మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు, వైసిపి, టిడిపి నాయకులు, పోలవరం ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

హైవే భద్రత అధికారులతో ఎంఎల్ఎ సమీక్ష

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణంలోని జనసేన కార్యాలయంలో ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ మంగళవారం టాటా ప్రాజెక్ట్ లిమిటెడ్ 216 హైవే భద్రత అధికారులతో సమీక్ష నిర్వహించారు. 216 హైవేలో ప్రమాదాలు జరగకుండా చూడాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో లీగల్ రామరాజు, అడ్మిన్ ఇన్‌ఛార్జి కిరణ్, ప్రాజెక్ట్ మేనేజర్ గోపాల్ కిరణ్, హైవే ఇన్‌ఛార్జి శ్రీనివాస్, తదితర అధికారులు పాల్గొన్నారు.

'బేడ, బుడగ, జంగాలను ఎస్‌సిలుగా గుర్తించాలి'

ఉండి: బేడ బుడగ జంగాలను ఎస్‌సిలుగా గుర్తించి కుల ధ్రువీకరణ పత్రాలను ఇవ్వాలని సిపిఐ ఉండి ఏరియా కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు కోరారు. ఈమేరకు మంగళవారం బేడ బుడగ జంగాలతో సిపిఐ ఆధ్వర్యంలో ఉండి ఎంఎల్ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజును మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎంఎల్ఎ స్పందిస్తూ బుడగ బేడా జంగాల సమస్యను సిఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.